మార్గం.. సుగమం

ఇది కదా అభివృద్ధి




- 15వ వార్డు పరిధిలో కొండవాలు ప్రాంతాల మెట్ల ఆధునికీకరణ
- రూ.60 లక్షల నిధులతో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న మూడు కాలనీల ప్రజలు

మద్దిలపాలెం : తూర్పు నియోజకవర్గంలో సుమారు 20 ఏళ్లగా కొండవాలు ప్రాంతాల ప్రజలు పడుతున్న మెట్ల కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. జీవీఎంసీ 15వ వార్డులో మూడు కాలనీలకు రూ.60 లక్షలతో నిధులతో మెట్ల ఆధునికీకరణ పూర్తి చేశారు. 15వ వార్డులోని కొండవాలు ప్రాంతాలలో ఉన్న ఇంటికి వెళ్లాలంటే సరైన మార్గం లేక ప్రజలు నానా హైరాన పడేవారు. పగలంతా కాయకష్టం చేసుకుని కొండపైన ఉండే ఇంటికి వెళ్లడానికి కూలీలు పడే ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. గత టీడీపీ ప్రభుత్వం కొండవాలు ప్రాంతాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కూడా లేవు. 2019లో రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏళ్ల నాటి సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయింది. స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవతో కొండవాలు ప్రాంతాలలో అభివృద్ధికి జీవీఎంసీ నుంచి రూ.60 లక్షలు మంజూరు అయ్యాయి. ప్రాంతాల వారీగా రూ.20 లక్షల చొప్పున వెచ్చించి మెట్ల మార్గాలను ఆధునికీకరించారు.

బల్లంకి కాలనీ మెట్ల మార్గం అభివృద్ధి

15వ వార్డు కొండవాలుపై ఉన్న దుర్గానగర్ కాలనీతో పాటు బల్లంకి వీధికి 20 ఏళ్లగా మెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో సుమారు 3 వేల మంది జనాభా నివసిస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న మెట్లను గమనించిన కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య రూ.20 లక్షలతో అభివృద్ధి చేసి, బల్లంకి వీధి ప్రజల కష్టాలు తీర్చారు.



బల్లంకి కాలనీలో నిర్మించిన మెట్ల మార్గం(ఇన్‌సెట్) గతంలో శిథిలమైన మార్గం

సింహాద్రిపురం కాలనీ సమస్యకు చెక్



సింహాద్రిపురం కాలనీలో మెట్లు లేని దృశ్యం




సింహాద్రిపురం కాలనీలో నిర్మించిన మెట్ల మార్గం

సింహాద్రిపురం కాలనీలో మెట్ల మార్గం శిథిలమైపోయింది. నిత్యం రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ఈ క్రమంలో రూ.20 లక్షల వ్యయంతో మెట్లకు మరమ్మతులు చేపట్టి, అభివృద్ధి చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త వెంకోజీ పాలెంలో..

కొత్త వెంకోజీపాలెంలో కొండవాలు మెట్ల మార్గం అధ్వానంగా తయారైంది. రాళ్లు తేలిపోవడంతో రాకపోకలకు కష్టతరంగా మారింది. ఈ క్రమంలో రూ.20 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కొండవాలుకు రాకపోకలు సాఫీగా సాగిపోతున్నాయి.





మెట్లకు మరమ్మతులు చేపట్టారు..



దుర్గానగర్ కాలనీకి ఎప్పుడో నిర్మించిన మెట్లు పూర్తిగా పాడైపోయాయి. దీంతో రాత్రి వేళలో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించడం చాలా ఇబ్బంది ఉండేది. శిథిలమైన మెట్లపై నడవడానికి వీలు లేకుండా ఉండేది. ఈ మార్గాన్ని మరమ్మతులు చేయడంతో సమస్య తీరింది.

– ఎస్.ఉషా, దుర్గానగర్

కొండవాలు మార్గాలకు మోక్షం



సింహాద్రిపురం కాలనీలో కొండవాలు మార్గాలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. కొండవాలుకు ఉన్న మెట్ల మార్గం కాస్త శిథిలం కావడంతో నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు మెట్ల మార్గాన్ని ఆధునికీకరించడం ఎంతో బాగుంది.

– బుగత మెర్సీ, సింహాద్రి పురం కాలనీ

గతంలో ఎవరూ పట్టించుకోలేదు..



రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం రాగానే కొండవాలు ప్రాంతాలలో అభివృద్ధికి ప్రారంభమైంది. ఎప్పుడో నిర్మించిన మెట్లు శిథిలమైనా గతంలో ఎవరూ పట్టించుకోలేదు. దీంతో శిథిలమైన మెట్లపై రాకపోకలు సాగించడం చాలా కష్టంగా ఉండేది. స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవతో రూ.20 లక్షల వ్యయంతో కొండవాలుపై కొన్ని చోట్ల కొత్త మెట్లు, మరికొన్ని చోట్ల మరమ్మతులు చేపట్టారు.

– రాంబిల్లి సురేష్, కొత్త వెంకోజీపాలెం

20 ఏళ్ల నాటి కల నెరవేరింది..



బల్లంకి కాలనీకి 20 ఏళ్లగా మెట్లు నిర్మించడం మహాప్రభో అని వేడుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ ఏడాది వార్డులో కొత్తగా బల్లంకి మెట్ల మార్గాన్ని నిర్మించారు. దీంతో కొండపైన ఇంటికి వెళ్లడానికి మార్గం సుగమం అయింది. ఎట్టకేలకు 20 ఏళ్ల నాటి కల నెరవేరింది.

– గొలగాని పార్వతి, బల్లంకి

క్లుప్తంగా

శివరామకృష్ణకు పరామర్శ



విజయలక్ష్మి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తల్లి విజయలక్ష్మి ఈ నెల 5న మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆదివారం ఆరిలోవలో శివరామకృష్ణ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. విజయలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, జార్జి నాని, తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ఆర్టీసీ డిపోల వద్ద ధర్నాలు

మద్దిలపాలెం : ఆర్టీసీ విజయనగరం జోన్-1 పరిధిలో ఈ నెల 12, 13 తేదీలలో భోజన విరామ సమయంలో గేట్ ధర్నాలు నిర్వహించనున్నామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోన్-1 అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, ఎం.వి.ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విధిగా ఉద్యోగులందరూ ఆయా తేదీలలో సమయానికి గేట్ ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభ్యులందరూ రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొనాలని కోరారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం ఈ నిరసన చేపడుతున్నామని, యాజమాన్యాలు దృష్టి సారించాలని వారు కోరారు.

మానవ హక్కుల ఉల్లంఘన బాధాకరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

డాబాగార్డెన్స్ : ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన అనేక చోట్ల జరుగుతూనే ఉందని దామోదర సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ నేతృత్వంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులు కల్పించిందన్నారు. అయితే ఆ హక్కులు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తాము నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తమ హక్కులకు భంగం కలిగితే ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా చైర్మన్, వేంకటేశ్వర విశ్వ విద్యాలయం డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం, మానవ హక్కుల ప్రతినిధులు ఎస్‌వీ రమణ, సోమసుందరరావు, బి. మల్లేశ్వరరావు, నక్కాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో రైలు కింద పడి సుమారు 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల తెలిపిన వివరాలు... రైలు ఢీకొట్టడంతో మృత దేహం గుర్తు పట్టలేని విధంగా పడి ఉంది. మృతుడి వద్ద ఆధారాలు దొరకకపోవడంతో గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని శరీరంపై నీలం రంగుల గీతలు గల షర్టు, క్రీమ్ కలర్ ఫ్యాంటు ఉన్నాయి. వివరాలు తెలిసినవారు రైల్వే పోలీస్ ఎస్ఐ కామేశ్వరరావు 9493424987, సీఐ సీహెచ్ ధనుంజయ్ నాయుడు 9440627547 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

'దయాల్‌బాగ్' వస్తు ప్రదర్శనకు విశేష స్పందన

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన వస్తు ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. దయాల్‌బాగ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో దేశంలో పలు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్లలో తయారు చేసిన వస్తువులను తక్కువ ధరకు ప్రతి సంవత్సరం డిసెంబరు రెండో ఆదివారం ప్రదర్శన ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇక్కడ షర్ట్ క్లాత్‌లు, తువ్వాళ్లు, బెడ్ షీట్లు, షూలు, చెప్పులు, నూనెలు, సబ్బులు, అగరుబత్తిలు, బనియన్లు, డిటర్జెంట్ పౌడర్లు తదితర వస్తువులను నిర్వాహకులు ప్రదర్శనలో విక్రయానికి పెట్టారు. విశాలాక్షినగర్, ఆరిలోవ, ఆదర్శనగర్, ఎంవీపీ కాలనీతో పాటు నగరంలో పలు ప్రాంతాల నుంచి వందలా మంది రావడంతో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ ప్రదర్శనలో వస్తువుల విక్రయం సుమారు గంటలోనే ముగిసింది. ఈ సందర్భంగా ప్రదర్శన ఇన్‌చార్జి కె.ఎస్.ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రదర్శనలో రూ.6 లక్షలు విలువ చేసే వస్తువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నాణ్యమైన వస్తువులు కావడంతో ప్రతి సంవత్సరం ఇక్కడ ప్రదర్శన కోసం ప్రజలు ఎదురు చూస్తుంటారన్నారు. రూ.ఆరు లక్షలు వస్తువులు గంట సమయంలో విక్రయించామన్నారు. ఈ కార్యక్రమంలో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ సౌత్ ఇండియా(రీజనల్) ఇన్‌చార్జి వసంత్‌కుమార్, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, గురుచరణ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

శాశ్వత శ్లాబ్ నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలి

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో శాశ్వతంగా శ్లాబ్‌లు నిర్మించుకోవడానికి అధికారులు అనుమతి ఇవ్వాలని గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు కోరారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులతో కలిసి బాబూరావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్నవన్నీ రేకుల షెడ్లన్నారు. సుమారు 40 ఏళ్లగా ఇక్కడ వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. తుపానులు, భారీ వర్షాలు వచ్చే సమయంలో రేకుల షెడ్లు ఎగిరిపోయి తరచూ ఇబ్బందిపడుతున్నామన్నారు. ఆయా సమయాలలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు వచ్చి నష్టపరిహారం ఇస్తున్నారన్నారు. శాశ్వత నివాసాలకు అనుమతి ఇస్తే ఈ దుస్థితి రాదని విజ్ఞప్తి చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మా గ్రామంలో నివాసాలకు శ్లాబ్‌లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ సమస్య పరిష్కరించకపోతే రానున్న 2024 సాధారణ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ సంఘం గౌరవాధ్యక్షుడు కాకర గోవిందు, సభ్యులు వీరబాబు, వెంకటేశ్వరరావు, గెడ్డం నాయుడు, వెంకటశ్రీధర్, రంజిత్, చిన్నారావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణాపురం గ్రామ సంఘం సభ్యులు

లారీ కింద పడి మానసిక రోగి ఆత్మహత్య



మృతుడు ఈశ్వర్ గమాంగొ(ఫైల్)

ఆరిలోవ: జాతీయ రహదారిపై వెలుతున్న లారీ కింద తలపెట్టి ఓ మానసిక రోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ద్వారకా క్రైం సీఐ ఇమాన్యుయేల్‌రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా భామిని గ్రామానికి చెందిన ఈశ్వరి గమాంగొ(53) మానసిక వ్యాధితో కొన్నాళ్లుగా బాధపడుతున్నాడు. ఆయనను బంధువులు తరచూ విశాఖ మానసిక ఆస్పత్రికి వైద్యం కోసం తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న బంధువు సహదేవ్ సబర్ ఈశ్వర్‌ను విశాఖ మానసిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో కొంత సమయం గడిపిన అనంతరం ఈశ్వర్ తన బంధువు అయిన సహదేవ్‌కు చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఈశ్వర్ తమ్ముడు బనమాలి గమాంగో ఒడిశా నుంచి విశాఖ వచ్చి ఈనెల 9న మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారిపై పాత డెయిరీ ఫారం కూడలి వద్ద సిగ్నల్ పడడంతో ఆగి ఉన్న లారీ వెనక టైర్ పక్కన ఈశ్వర్ కొంత సేపు నిలబడ్డాడు. ఆ లారీ కదిలిన వెంటనే వెనక టైర్ కింద తల పెట్టేసి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆదివారం ఉదయం అక్కడ సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించగా లారీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. దీనిపై మృతుడు తమ్ముడు బనమాలి గమాంగో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కట్టమంచికి ఘన నివాళి



కట్టమంచి విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఏయూ పరిపాలన భవనం, స్నాతకోత్సవ మందిరం వద్దనున్న కట్టమంచి రాలమలింగారెడ్డి విగ్రహాలకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా పయణించాలి

డాబాగార్డెన్స్ : దేశం, రాష్ట్రంలో సంఖ్యాపరంగా అధికంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడారు. అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో 40 రోజుల పాటు రథయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో 275 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు మహిళా సబ్ కోటా కల్పించాలన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో తప్పనిసరిగా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.

చైన్ స్నాచర్‌కు రిమాండ్



నిందితురాలి నుంచి రికవరీ చేసిన బంగారు గొలుసు

గోపాలపట్నం: సింహాచలంలో బాలిక మెడలో బంగారు చైన్‌ను దొంగిలించిన మహిళను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 2న సామర్లకోటకు చెందిన గండిపిల్లి శ్రీరాములు కటుంబ సభ్యులతో సింహాచలం వరాహలక్ష్మి నృసింహ స్వామిని దర్శించుకోవడానికి వచ్చారు. సింహాచలంలో శ్రీరాములు మేనకోడలైన వేదాక్షి మెడలో ఉన్న 12 గ్రాముల చైన్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోవడంతో చుట్టు పక్కల వెతికారు. సామర్ల కోట వెళ్లి ఇంట్లో కూడా వెతికి చూసుకున్నారు. అక్కడా లేకపోవంతో గోపాలపట్నం క్రైం పోలీసులకు ఈ నెల 9న ఫిర్యాదు చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ సీఐ బీవీజే రాజు పర్యవేక్షణలో మేరకు ఎస్ఐ కేవీ సురేష్ దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ పుటేజీలు పరిశీలించి వాటి ఆధారాలతో మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారించగా చైన్‌ను దొంగిలించినట్లు అంగీకరించడంతో ఆమె నుంచి గొలుసు రికవరీ చేసి ఆమెను రిమాండ్‌కు తరలించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. 'విశాఖ వ్యాలీ స్కూల్ గ్రాండ్ మాస్టర్ గిల్డ్ ఇంటర్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్-2023'పేరుతో నిర్వహించిన ఈ పోటీలను కలెక్టర్ సతీమణి డాక్టర్ పి.ఎస్.నిహారిక ప్రారంభించారు. అనంతరం పిల్లల ఆట తీరును పరిశీలించారు. ఎత్తుకు పైఎత్తు వేస్తూ ఆడుతున్న పిల్లలను ఆమె అభినందించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ పోటీలలో నగరంలో విశాఖ వ్యాలీతో పాటు టింపనీ, డీఏవీ పబ్లిక్ స్కూల్, నేవీ చిల్డ్రన్ స్కూల్, కేవీ-1, 2, శారదా విద్యానికేతన్, సిల్వర్ ఓక్స్, ఓక్రిడ్జి, నారాయణ, శ్రీచైతన్య తదితర 32 పాఠశాలలు నుంచి 392 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలను నాలుగు కేటగిరీల్లో నిర్వహించారు. కేటగిరి-1లో ఎల్‌కేజీ నుంచి మూడో తరగతి, కేటగిరి-2లో 4 నుంచి 6వ తరగతి, కేటగిరి-3లో 7 నుంచి 9వ తరగతి, కేటగిరి-4లో 10 నుంచి 10 ప్లస్ టు వరకు పోటీలు నిర్వహించారు. ప్రతి కేటగిరి నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికల చొప్పున ఎంపిక చేసి బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



చదరంగం పోటీలు ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ సతీమణి నిహారిక

పార్కుల్లో వన భోజనాల సందడి



జూ పార్కులో భోజనాలు చేస్తున్న సందర్శకులు



ముడసర్లోవ పార్కులో శిష్టకరణాల పిక్నిక్ వేదికపై ఎంపీ జీవీఎల్ నరసింహారావు, తదితరులు

ఆరిలోవ: కార్తీక మాసం ఆఖరి ఆదివారం పార్కులు సందడిగా మారాయి. ఆఖరి వారం కావడంతో ఎక్కువ మంది వనభోజనాలు నిర్వహించుకున్నారు. ముడసర్లోవ పార్కు, కంబాలకొండ ఎకో టూరిజం పార్కు, జూ పార్కు, కైలాసగిరి సందర్శకులతో కళకళలాడాయి. ఆయా పార్కుల్లో కుటుంబాలతో పాటు కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు వనభోజనాలు జరుపుకొని ఆటపాటలతో సరదాగా గడిపారు. అంతా కలసి సహఫంక్తి భోజనాలు చేశారు. ముడసర్లోవ పార్కులో సీతమ్మధార శిష్ట కరణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్. నర్సింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం సభ్యులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిష్ట కరణాలను జాతీయ వెనుకబడిన వర్గం జాబితాలో చేర్చడానికి ఏబీసీ కమిషన్ సిఫార్సు చేసిందని తెలిపారు.

నేడు టైకూన్ జంక్షన్ వద్ద ధర్నా

సీతమ్మధార: టైకూన్ జంక్షన్ వద్ద పార్టీలకతీతంగా ఈ నెల 11న ధర్నా నిర్వహించనున్నట్లు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతూ టైకూన్ హోటల్ కూడలి వద్ద రోడ్డును మూసి వేయడం అన్యాయమన్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.